తల్లితో కలిసి ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో కఠిన నిర్ణయం

మల్కాజిగిరి ఠాణా పరిధిలో ఘటన

మల్కాజిగిరి, ఫిబ్రవరి 20: ఆర్థిక ఇబ్బందులు భరించలేక తల్లితోసహా ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మల్కాజిగిరి ఠాణా పరిధిలో రెండ్రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన స్వరూప (55)కు ఇద్దరు కుమారులు రవి, శ్రీకాంత్ (35) ఉన్నారు. శ్రీకాంత్ ఆటోను కిరాయికి తీసుకొని నడిపిస్తుండేవాడు. వ్యసనాలకు బానిసై అప్పులు చేశాడు. నిజామాబాద్‌లో అప్పు లిచ్చినవారి ఒత్తిడి పెరగడంతో తల్లితోసహా హైదరాబాద్‌కు వచ్చాడు. శ్రీకాంత్‌కు కొన్నేండ్ల క్రితం వివాహం కాగా, భార్య అతడిని విడిచి వెళ్లింది. మలక్‌పేటలో శ్రీకాంత్ కిరాయికి క్యాబ్, ఆటో నడిపించాడు. అక్కడా అప్పులు చేసి మల్కాజిగిరికి వచ్చారు. పటేల్‌నగర్‌లో ఏడాదిన్నరగా ఉంటున్నారు. రెండ్రోజులుగా వీరి ఇంటి తలుపులు తెరవకపోవడంతో ఇంటి యజమానికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారొచ్చి తలుపులను పగులగొట్టి చూడగా ఇంటి కప్పు రాడుకు చీరతో తల్లి, కుమారుడు ఉరివేసుకొని కనిపించారు. రెండు రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. అన్న రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

ధాన్యం టెండర్ ధరలకు సీఎం ఆమోదం!

హైదరాబాద్, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): యాసంగి ధాన్యం వేలం ప్రక్రియ తుది దశకు చేరుకున్నది. టెండర్లలో బిడ్డర్లు వేసిన ధరలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్లడానికి ముందే పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, ఇతర అధికారులతో ఈ విషయమై చర్చించి బిడ్డర్లు దాఖలు చేసిన ధరలకు ఓకే చెప్పినట్టు సమాచారం. నిరుడు యాసంగి సీజన్‌కు సంబంధించిన 35 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం వేయాలని నిర్ణయించిన ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగా మొత్తం 12 లాట్లకు 26 బిడ్లు దాఖలైనట్టు తెలిసింది. సాధారణ రకం ధాన్యానికి గరిష్ఠంగా రూ.1950, సన్నరకం ధాన్యానికి రూ. 2,100 వరకు ధరను కోట్ చేసినట్టు సమాచారం.

రాజీవ్ భీమాకు రేవంత్ గండి

సొంత నియోజకవర్గం కొడంగల్ కోసం ప్రాజెక్టుకే ఎసరు • ఒక టీఎంసీ సాగు 15 వేల ఎకరాలకు పెంపు • 20 టీఎంసీల నికరజలాల్లో 7.11 టీఎంసీలకు కోత

- కొడంగల్ లిఫ్టుకు కేటాయింపు
- ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాజెక్టు ప్రతిపాదన
- రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆపేసిన కేసీఆర్
- సొంత ఇమేజ్ కోసం తెలంగాణకు సీఎం రేవంత్‌రెడ్డి ద్రోహం

భీమా ప్రాజెక్టు స్టేజ్-1లోని పంచదేవుపాడు ఎత్తిపోతల కేంద్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత ఇమేజ్ కోసం రాజీవ్‌భీమా ఎత్తిపోతల పథకానికే గండికొడుతున్నారు. అదనపు జలాలను సాధించాల్సింది పోయి, సాధించుకున్న నికర జలాలకే ఎసరు పెడుతున్నారు. రాజకీయ స్వార్థానికి ఇటు భీమా ఆయకట్టు రైతులకు, అటు సొంత నియోజకవర్గం రైతులకు తీరని విద్రోహాన్ని తలపెడుతున్నారు. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా ప్రతిపాదించిన కొడంగల్ –నారాయణపేట లిఫ్ట్ పనులను చేపట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. రూ.2,945 కోట్లతో ఇటీవలే అందుకు పరిపాలన అనుమతులివ్వగా, బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి ఆ పనులకు శంకుస్థాపన చేసేందుకు సిద్ధమయ్యారు.

రాజీవ్‌భీమా జలాలకు గండి

కృష్ణా డెల్టాకు ట్రిబ్యునల్ –1 దాదాపు 183 టీఎంసీలను చారిత్రక రక్షణల కింద కేటాయించింది. డెల్టా కాల్వల ఆధునికీకరణ వల్ల 29 టీఎంసీల మేరకు మిగులు ఏర్పడుతున్నదని చెప్పి అందులో 9 టీఎంసీలను పులిచింతల ప్రాజెక్టుకు కేటాయించింది. మిగిలిన 20 టీఎంసీలను తెలంగాణ ఉద్యమానికి జడిసి రాజీవ్ భీమా ప్రాజెక్టుకు ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకులు కేటాయించారు. ప్రాజెక్టు కింద ఒక టీఎంసీకి 10 వేల ఎకరాలకు నీరందించేలా మొత్తంగా 2.03 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని నిర్ణయించారు. జలయజ్ఞంలో భాగంగా రాజీవ్ భీమా ప్రాజెక్టును ప్రారంభించినా, రాష్ట్ర ఏర్పాటు నాటికి పనులేమీ పూర్తికాలేదు. తెలంగాణ ఏర్పాటు అనంతరమే పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం భీమా ప్రాజెక్టు కింద ఇప్పటికే 1.58 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. మిగిలిన ఆయకట్టుకు నీరందించేందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే ఈ ప్రాజెక్టును సత్వర సాగునీటి ప్రయోజిత కార్యక్రమం (ఏఐబీపీ) కింద గత ప్రభుత్వం చేర్చింది. మరో రూ.45 కోట్లను కేటాయిస్తే ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన పూర్తి ఆయకట్టుకు సాగునీరందుతుంది. ఇటీవలే కేంద్రానికి ప్రతిపాదనలను కూడా పంపింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు భీమా ప్రాజెక్టు డ్యూటీని (1 టీఎంసీకి సాగయ్యే భూమి) 10,000 ఎకరాల నుంచి 15,000 ఎకరాలకు పెంచింది. తద్వారా 20 టీఎంసీల నికరజలాల్లో 7.33 టీఎంసీల నీటిని సేవింగ్స్ కింద చూపించి కోత విధించింది. 12.67 టీఎంసీల నీటితోనే భీమా కింది ఆయకట్టు అవసరాలను తీర్చవచ్చని నిర్ధారించింది. భీమా ఆయకట్టు రైతులకు చెందాల్సిన 7.33 టీఎంసీల జలాల్లో 7.11 టీఎంసీలను నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకానికి కేటాయించింది.

ఉమ్మడి సర్కారు కుట్రలకే మొగ్గు!

బేసిన్ అవతలి తమ ప్రాజెక్టులకు కృష్ణా జలాలను యథేచ్ఛగా కేటాయించుకున్న ఉమ్మడి రాష్ట్ర పాలకులు, బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులపై ఆది నుంచీ వివక్ష చూపారు. భీమా ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయకుండానే, కుట్రపూరితంగా ప్రాజెక్టు నికర జలాలను కుదించి, మిగిలిన జలాల్లో 7.11 టీఎంసీలను కొడంగల్ –నారాయణపేట లిఫ్ట్‌కు ఉమ్మడి సర్కారే కేటాయించింది. నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లోని 10 మండలాల్లో 40,470 హెక్టార్లకు (సుమారు లక్ష ఎకరాలకు) సాగునీరందించడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్టేజ్ –1 అనుమతిని మంజూరుచేస్తూ జీవో 69ని మే 23, 2014లో జారీచేసింది. ఆ జీవోపై తెలంగాణ వాదులు, సాగునీటి రంగ నిపుణులు అనాడే తీవ్ర వ్యతిరేకత వ్యక్తంచేశారు. జీవో 69కి కొనసాగింపుగా కాంగ్రెస్ సర్కారు మరో జీవో విడుదల చేసింది. కొడంగల్–నారాయణపేట లిఫ్ట్ స్కీమ్ స్టేజ్–1 పనులకు ఏకంగా రూ.2,945.50 కోట్లతో అనుమతులు మంజూరు చేసింది. కృష్ణా జలాల్లో అధికమొత్తంలో నీటిని డిమాండ్ చేయాల్సిన తరుణంలో ఏకంగా నికరజలాల్లోనే కోతలు విధించటమే ఏమిటని తెలంగాణవాదులు మండిపడుతున్నారు. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ స్కీమ్‌ను నాలుగు దశల్లో చేపట్టి నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్నారు.

నారాయణపేట- కొడంగల్, పీఆర్ఎస్ఐఎస్ కింద ప్రతిపాదించిన ఆయకట్టు (ఎకరాలు)

	నారాయణపేట	పీఆర్ఎస్ఐఎస్
ఊటుకూరు	19,625	39,888
మక్తల్	6,158	20,069
నారాయణపేట	9,134	21,315
ధన్వాడ	1,197	8,278
దామరగిద్ద	10,141	9,040
దౌలతాబాద్	10,528	18,122
కోస్గి	14,642	25,205
మద్దూర్	17,558	22,757
కొడంగల్	4,085	18,409
బొమ్రాసిపేట	6,932	23,633
మొత్తం	1,00,000	2,06,716

జలవిద్యుత్తు ప్రాజెక్టులపై విచారణ ఏప్రిల్ 30కి వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి20 (నమస్తే తెలంగాణ): జలవిద్యుత్తు ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకోవాలని ఏపీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఏప్రిల్ 30కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. అప్పుడే తుది వాదనలను వింటామని ఇరు రాష్ట్రాలకు సూచించింది. ఏపీ దాఖలు చేసిన ఆ పిటిషన్‌పై జస్టిస్ అయ్ఏస్ ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుదీర్ఘమైన వాదనలు వినిపించాల్సి ఉందని, ఈ నేపథ్యంలో మరోరోజుకు కేసు విచారణను వాయిదా వేయాలని తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపించారు.

వాలంతరికీ రూ.3.79 కోట్లు

వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్, రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (వాలంతరి) నిర్వహణకు ప్రభుత్వం రూ.3.79 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

> "రోడ్లు, ఫ్లైఓవర్లు అనేవి ఒక లెవల్ టెక్నాలజీ. అంతకుమించి టన్నెల్ టెక్నాలజీ ఉంది. స్టైయిట్ కనెక్టివిటీ లైన్. దిల్‌సుఖ్‌నగర్ నుంచి జూబ్లీ హిల్స్ వరకు వెళ్లాలనుకున్నా! బహదూర్‌పుర నుంచి బాలానగర్ వరకు వెళ్లాలనుకున్నా అండర్ టన్నెల్ రోడ్డు ద్వారా స్ట్రైయిట్‌గా వెళ్లొచ్చు. బయటి రోడ్లు ఉన్నట్టు కాదు. టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)తో ఎంత కావాలంటే అంత రోడ్డు వేసుకోవచ్చు"
>
> గత నవంబరు 3న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా టీయాడబ్ల్యూజే 'మీట్‌దిప్రెస్'లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తపరిచిన ఆలోచన ఇది. ఇందుకు అనుగుణంగా జీహెచ్ఎంసీ అధికారులు గ్రేటర్ హైదరాబాద్‌లో సొరంగ రహదారుల ప్రతిపాదనలపై తొలి అడుగువేశారు. నగర పౌరులను ట్రాఫిక్ కష్టాల నుంచి బయటపడేసేందుకు టన్నెల్ రోడ్ల (సొరంగ రహదారులు) నిర్మాణాలపై అధికారులు దృష్టిసారించారు. నగరంలో ఐదుచోట్ల 39 కిలోమీటర్ల పొడవున టన్నెల్ రోడ్ల నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసేందుకు ఆసక్తి వ్యక్తీకరణ టెండర్ పిలిచారు.

గ్రేటర్‌లో సొరంగ మార్గాలు

ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా నిర్ణయం

- 39 కి.మీ నిర్మాణానికి ప్రతిపాదనలు
- ఐటీసీ కోహినూర్ కేంద్రంగా 3 మార్గాలు
- ఈవోఐ టెండరు పిలిచిన జీహెచ్ఎంసీ

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగుతుండడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు సమీక్ష నిర్వహించారు. సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా తెలుసుకొని నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ విభాగం అధికారులు నగరంలో పర్యటించి పరిశీలించారు. జనాభా పెరుగుదలతోపాటు వాహనాల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతుండడంతో సమస్య రోజురోజుకు మరింతగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు టన్నెల్ రోడ్ల నిర్మాణంపై దృష్టిసారించి ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డి కూడా ఇదే ఆలోచనను వెల్లడించారు. ఇప్పుడు అధికారులు కూడా అదే ప్రతిపాదనను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా నగరంలోని ఐదు కీలక ప్రాంతాలను ఎంచుకున్నారు. ఐటీసీ కోహినూర్ కేంద్రంగా చేసుకుని మూడు మార్గాల్లో సొరంగ రహదారుల నిర్మాణాన్ని ప్రతిపాదించారు. ఇందులో పాతనగరానికి కూడా ప్రాధాన్యమిచ్చారు. దాదాపు 39 కిలోమీటర్ల మేర టన్నెల్ రోడ్ల నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను గుర్తించడంతోపాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించేందుకు నిర్ణయించారు. ఇందుకోసం అధికారులు ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) బిడ్ల కోసం టెండరు జారీచేశారు. టీబీఎం (టన్నెల్ బోరింగ్ మిషన్) ద్వారా సొరంగ రహదారుల నిర్మాణంపై సాంకేతికంగా నివేదికను అందించేందుకుగాను కన్సల్టెన్సీని ఎంపిక చేయనున్నారు.

ఈవోఐ టెండరులో ప్రతిపాదనలు - దూరం (కిలోమీటర్లు)

- ఐటీసీ కోహినూర్ నుంచి విప్రో సర్కిల్ వరకు వయా ఖాజాగూడ, నానక్‌రాంగూడ - 9 కి.మీ
- ఐటీసీ కోహినూర్ నుంచి జేఎన్‌టీయూ వరకు వయా మైండ్ స్పేస్ జంక్షన్ - 8 కి.మీ
- ఐటీసీ కోహినూర్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నం.10 వయా జూబ్లీహిల్స్ రోడ్ నం. 45 - 7 కి.మీ
- జీవీకేమాల్ నుంచి నానల్‌నగర్ వయా మాసబ్‌ట్యాంక్ - 6 కి.మీ.
- నాంపల్లి నుంచి చాంద్రాయణగుట్ట ఇన్నర్ రింగురోడ్డు గుట్ట వయా చార్మినార్, ఫలక్‌నుమా - 9 కి.మీ

అన్నారం బరాజ్ సేఫ్

- దానికొచ్చిన ఆపదేమీ లేదు
- చిన్నచిన్న లోపాలు సవరిస్తే సరి
- పిల్లర్లకు ఎలాంటి ప్రమాదం లేదు
- సీపేజ్‌లకు ట్రీట్‌మెంట్ సరిపోతుంది
- ఇన్వెస్టిగేషన్ వెంటనే పూర్తి చేయించాలి
- రాష్ట్ర నిపుణుల బృందం సూచన
- బరాజ్ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ పరిశీలన
- మేడిగడ్డలో కుంగిన పిల్లర్ల సందర్శన

మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలిస్తున్న నిపుణుల బృందం

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ)/కాళేశ్వరం/ మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లను రాష్ట్ర గ్రౌటింగ్, మెకానికల్, డిజైన్ తదితర నిపుణుల బృందం మంగళవారం పరిశీలించింది. బరాజ్‌ల గ్రౌటింగ్ నిపుణుడు విజయ్ టీ దేశాయ్, సాంకేతిక నిపుణుడు సత్యనారాయణ, డిజైన్ నిపుణుడు రాజశేఖర్, ఇరిగేషన్ హెడ్ అనిల్‌కుమార్, డ్యాం సేఫ్టీ అర్గనైజేషన్ సీఈ ప్రమీల, ఎస్ఈ శ్రీనివాస్, డీఈ దయాకర్‌రెడ్డి తదితరులు బరాజ్‌లను పూర్తిస్థాయిలో పరిశీలించారు. మొదట అన్నారం బరాజ్‌లో ఏర్పడిన సీపేజ్‌లను పరిశీలించి గ్రౌటింగ్ చేసిన తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రౌటింగ్‌కు ఎలాంటి కెమికల్ వాడారు? కెమికల్ ఫోమింగ్ పిరియడ్ ఎంత? ఎన్ని సీపేజ్‌లకు గ్రౌటింగ్ చేశారు? అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈఈ యాదగిరి సీపేజ్‌ల గురించి, గ్రౌటింగ్ చేసిన తీరును, వాడిన కెమికల్‌ను నిపుణుల బృందానికి వివరించారు. నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ నిపుణులు హిమాచల్‌ప్రదేశ్ నుంచి పాలీ యూరిత్రిన్ కెమికల్‌ను హెలికాప్టర్ ద్వారా తెప్పించి గ్రౌటింగ్ చేశారని తెలిపారు. 38,28 ఔట్‌లెట్లలో మొదట సీపేజ్‌లు ఏర్పడ్డాయని, వాటిని నివారించగా మరో చోట నుంచి సీపేజ్‌లు బయటికి రాగా వాటికి సైతం గ్రౌటింగ్ చేసినట్టు వెల్లడించారు. బరాజ్‌లోని అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్‌లను, ప్రతి పిల్లర్‌ను, గ్రౌటింగ్ చేసిన ప్రతి సీపేజ్‌ను నిపుణుల బృందం పరిశీలించింది. బరాజ్‌లో అప్‌స్ట్రీమ్ టు డౌన్‌స్ట్రీమ్ ఫాం కాలేదని, సీపేజ్‌లు సాధారణమని, గ్రౌటింగ్ చేసి పకడ్బందీగా అరికట్టాలని, పిల్లర్లకు సైతం ఎలాంటి ప్రమాదం లేదని నిపుణులు అభిప్రాయపడినట్టు తెలిసింది.

ఇప్పటికే ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయించాల్సింది..

ఇప్పటికే బరాజ్ నుంచి నీటిని తొలగించి ఇన్వెస్టిగేషన్ పనులు పూర్తి చేయించాల్సి ఉండేదని నిపుణులు సూచించారు. ఇన్వెస్టిగేషన్ పనులను పార్సన్ సంస్థకు అప్పగించినందున ఇన్వెస్టిగేషన్ పనులను వెంటనే ప్రారంభించాలని వారు పేర్కొన్నారు.

బరాజ్‌కు ముప్పేమీలేదు..

మొత్తానికి అన్నారం బరాజ్‌కు ఆపదేమీ లేదని, కొద్దిపాటి అప్రమత్తతతో బరాజ్‌ను నిలుపుకోవచ్చని నిపుణులు తేల్చిచెప్పినట్టు తెలిసింది. అక్కడి నుంచి నిపుణుల బృందం మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించి పియర్ల కుంగుబాటుపై విశ్లేషణ జరిపారు. ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నివేదికను ఎన్‌డీఎస్ఏకు సమర్పిస్తామని చెప్పి వెళ్లారు.

ఎన్‌డీఎస్ఏకు ప్రతిపాదనలు..

అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లలో నిపుణులు పరిశీలన జరిపి చేపట్టాల్సిన మరమ్మతులపై ప్రతిపాదనలు రూపొందించారు. ఏడో బ్లాకు మినహా మిగిలిన మిగతా బ్లాకుల్లో గ్రౌటింగ్ చేస్తే వర్షాకాలంలో ఇబ్బంది ఉండదనే నిర్ణయానికి వచ్చారు. సెవెన్‌టీ గ్రౌటింగ్, మైక్రో కాంక్రీట్, సాండ్ గ్రౌటింగ్, ప్రెసర్ గ్రౌటింగ్ వీటిలో ఏ పద్ధతిలో గ్రౌటింగ్ చేయాలనే విషయమై నిపుణులు, అధికారులు చర్చించి ప్రతిపాదనలు తయారు చేసినట్టు తెలిసింది.

స్వల్ప కాలంలో అధిక దిగుబడి

కంది సాగుకు ఇక్రిశాట్ కొత్త విధానం

ఒడిశాలో పైలట్ ప్రాజెక్టు విజయవంతం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): కందుల దిగుబడిని పెంచడమే లక్ష్యంగా ఒడిశాలో ఇక్రిశాట్ చేపట్టిన పైలట్ ప్రాజెక్టు సత్ఫలితాలను ఇచ్చింది. దీంతో స్వల్ప కాలంలో అధిక దిగుబడిని ఇవ్వడంతోపాటు తెగుళ్లను సమర్థంగా నియంత్రించగలిగే నూతన బ్రీడింగ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. దేశంలో కందుల వినియోగం నానాటికీ పెరుగుతుండటంతో వాటి దిగుమతులు ఏటేటా అధికమవుతున్నాయి. వీటిని తగ్గించుకునేందుకు నూతన బ్రీడింగ్ విధానం ఉపకరిస్తుందని ఇక్రిశాట్ పరిశోధకులు చెప్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 250 రకాలకుపైగా కంది వంగడాలు ఉన్నాయని, నూతన బ్రీడింగ్ విధానంతో కొత్త వంగడాలను మరింత వేగంగా అభివృద్ధి చేయడానికి వీలవుతుందని అంటున్నారు.

జాతీయ రహదారిగా ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం

- ప్రకటించేందుకు అంగీకరించిన కేంద్రం
- యుటిలిటీస్ తరలింపు ఖర్చు కేంద్రానిదే
- రేవంత్ విజ్ఞప్తులకు గడ్కరీ సానుకూలత

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల నిర్మిస్తున్న రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)లో చౌటుప్పల్–ఆమన్‌గల్–షాద్‌నగర్–సంగారెడ్డి మధ్య 182 కి.మీ. పొడవైన దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించేందుకు అడ్డంకులు తొలగిపోయాయి. కేంద్రం ఇప్పటికే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించింది. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశం తర్వాత దక్షిణ భాగాన్ని కూడా జాతీయ రహదారిగా ప్రకటించేందుకు అంగీకరించారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను పంపాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. తెలంగాణలోని జాతీయ రహదారుల విస్తరణకు అనుమతి ఇవ్వాలని, రాష్ట్రంలోని పలు ముఖ్యమైన రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని సీఎం రేవంత్ ఈ భేటీలో గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారులుగా విస్త రించాల్సిన రాష్ట్ర రహదారుల జాబితాను అందజేశారు. సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

అధికారులపై గడ్కరీ ఆగ్రహం

ఈ భేటీలో తొలుత రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలోని చౌటుప్పల్–భువనగిరి–తూప్రాన్–సంగారెడ్డి–కంది పరిధిలో యుటిలిటీస్ (కరెంటు స్తంభాలు, భవనాల) తొలగింపునకు సంబంధించిన వ్యయం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై చర్చ జరిగింది. యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు గతంలో చేసిన సూచనకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో ప్రతిష్టంభన ఏర్పడింది. కానీ, సీఎంగా రేవంత్ బాధ్యతలు స్వీకరించాక యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని భరించేందుకు అంగీకరిస్తూ ఎన్‌హెచ్ఏఐకి లేఖ పంపారు. ప్రస్తుత భేటీలో రేవంత్ ఈ అంశాన్ని ప్రస్తావించడంతో ఆ అంశంపై గడ్కరీ ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆరా తీశారు. యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని మెలిక పెట్టింది ఎరంటూ ఆ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వేళ రాష్ట్ర ప్ర భుత్వం యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని భరిస్తే భవిష్యత్తులో టోల్ వసూళ్ల ద్వారా వచ్చే ఆదాయంలో సగం భాగాన్ని రాష్ట్రానికి చెల్లించాల్సి ఉంటుందని గడ్కరీ పేర్కొంటూ.. యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని కేంద్రమే భరిస్తుందని హామీ ఇచ్చారు.ఆర్ఆర్ఆర్‌కు భూసేకరణతోపాటు ఇతర విధానపరమైన ప్రక్రియలను వేగవంతం చేయాలని రేవంత్‌కు గడ్కరీ సూచించారు.

అప్‌గ్రేడ్ చేయాలని సీఎం కోరిన రోడ్లు

1. మరికల్-నారాయణపేట-రామసముద్రం (63 కి.మీ.)
2. పెద్దపల్లి-కాటారం (66 కి.మీ.)
3. పుల్లూర్-అలంపూర్-జటప్రోలు-పెంట్లవెల్లి-కొల్లాపూర్-లింగాల-అచ్చంపేట-డిండి-దేవరకొండ-మల్లేపల్లి-నల్లగొండ (225 కి.మీ.)
4. వనపర్తి-కొత్తకోట-గద్వాల-మంత్రాలయం (110 కి.మీ.)
5. మన్నెగూడ-వికారాబాద్-తాండూర్-జహీరాబాద్-బీదర్ (134 కి.మీ.)
6. కరీంనగర్-సిరిసిల్ల-కామారెడ్డి-ఎల్లారెడ్డి-పిట్లం (165 కి.మీ.)
7. ఎర్రవెల్లిక్రాస్‌రోడ్-గద్వాల-రాయచూర్ (67 కి.మీ.)
8. జగిత్యాల-పెద్దపల్లి-కాల్వ శ్రీరాంపూర్-కిష్టంపేట-కల్వపల్లి-మోరంచపల్లి-రామప్ప దేవాలయం-జంగాలపల్లి (164 కి.మీ.)
9. సారపాక-ఏటూరునాగారం (93 కి.మీ.)
10. దుద్దెడ-కొమురవెల్లి-యాదగిరిగుట్ట-రాయగిరి క్రాస్‌రోడ్ (63 కి.మీ.)
11. జగ్గయ్యపేట-వైరా-కొత్తగూడెం (100 కి.మీ.)
12. సిరిసిల్ల-వేములవాడ-కోరుట్ల (65 కి.మీ.)
13. భూత్పూర్-నాగర్‌కర్నూల్-మన్ననూర్-మద్దిమడుగు (తెలంగాణ)-గంగలకుంట-సిరిగిరిపాడు (166 కి.మీ.)
14. కరీంనగర్-రాయపట్నం (60 కి.మీ.)

లోకం పోకడ

పార్టీ ప్రచారం అదిగో అలా చేస్తున్నారు!

ఎరువుల కాంట్రాక్ట్ కొత్తవారికే!

ఎరువుల సరఫరాపై అధికారుల సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): 2024-25 సంవత్సరానికి గాను ఎరువుల సరఫరా, నిల్వకు సంబంధించిన చర్యలపై మంగళవారం వ్యవసాయశాఖ కమిషనర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వారినే ఈ ఏడాది కొనసాగించాలా? లేదండే, కొత్తగా మళ్లీ టెండర్లు పిలవాలా? అనే అంశంపై చర్చించారు. ఇటీవల పలు ప్రాంతాల్లో ఎరువుల కొరత ఏర్పడింది. దీనికి కారణం ప్రస్తుత ఏజెన్సీ నిర్లక్ష్యమే కారణమని, ఎరువుల సరఫరాలో ఆ సంస్థ విలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టెండర్‌కే మొగ్గుచూపినట్టు తెలిసింది. దీనిపై అధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సమీక్షలో వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	14.5°c	37.3°c
మెదక్	16.5°c	37.5°c
ఆదిలాబాద్	17.7°c	38.1°c
హైదరాబాద్	19.7°c	34.7°